క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పెంపు

నాగార్జునసాగర్: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదవ తరగతి ప్రవేశాల (2024–25)కు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఈమేరకు మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయం నాగార్జునసాగర్ ప్రిన్సిపాల్ రజనీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు 18వ తేదీ నుంచి అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. 2023– 24 విద్యా సంవత్సరంలో నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఫిబ్రవరి 11న ప్రవేశపరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

త్రిపురారం: మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో బాబుసాయి పేట రోడ్డులో గల టీఎస్ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024– 25 విద్యా సంవత్సరానికిగాను ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆరో తరగతిలో ప్రవేశానికి www.telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 7, 8, 9, 10వ తరగతుల్లో కూడా ఖాళీ సీట్లను ఆన్‌లైన్ ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆరో తరగతి పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతికి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి పరీక్ష జరిగే ముందు రోజు వరకు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

ఎస్పీని కలిసిన బీసీ సంఘం నాయకులు



ఎస్పీ చందన దీప్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడ అర్బన్: ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చందనదీప్తిని బుధవారం ఆమె కార్యాలయంలో బీసీ సంఘం నాయకులు కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో మహిళా బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి బంటు కవిత, నాయకులు చేగొండి మురళీయాదవ్, అంజి, సురేష్ తదితరులున్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో యువజన దినోత్సవం



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని బుధవారం దేవరకొండ పట్టణంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటికోల్ ఎక్స్‌రోడ్డు నుంచి దేవరకొండ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో లింగాల రాకేశ్, యలమల గోపిచంద్, అంకూరి శ్రీకాంత్, హేమసుందర్, తేజ్, కావ్య, అంజలి, భవిత, పావని తదితరులు పాల్గొన్నారు.

ఆ కౌన్సిలర్లను అనర్హులుగా ప్రకటించాలి

నల్లగొండ టూటౌన్: బీఆర్ఎస్ పార్టీ జారీ చేసిన విప్ ఉల్లంఘించి అవిశ్వాస తీర్మానంలో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన కౌన్సిలర్లను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ నీలగిరి మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి బుధవారం కలెక్టర్ హరిచందనకు వినతి పత్రం అందజేశారు. విప్ ఉల్లంఘనపై వెంటనే విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హరిచందనకు పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రక్షణ దుస్తులు అందేదెప్పుడో..



మిర్యాలగూడ మున్సిపాలిటీలో చేతులకు కవర్లు చుట్టుకుని పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

- మున్సిపల్ కార్మికులకు అందని రక్షణ దుస్తులు, ఇతర సామగ్రి
- చలికోటు, గ్లౌజ్‌లు, మాస్క్‌లు, బూట్లు లేకుండానే పారిశుద్ధ్య పనులు
- మిర్యాలగూడలో మొత్తం 278 మంది కార్మికులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు గత కొంతకాలంగా రక్షణ దుస్తులు, పరికరాలు అందడం లేదు. మున్సిపాలిటీలో 48వార్డులు ఉండగా 18 మురికివాడలు, మరో 18 నాన్ మురికి వాడలున్నాయి. మొత్తం 278 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో 34 మంది పర్మినెంట్ కార్మికులు ఉన్నారు. వీరంతా మున్సిపాలిటీలో ప్రతి రోజు 65 మెట్రిక్ టన్నులు, డోర్ టూ డోర్ చెత్త సేకరణ 5 మెట్రిక్ టన్నులు సేకరిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీరికి ప్రతి సంవత్సరం రక్షణ దుస్తులు అందించాలి. అంతేకాకుండా చలికాలంలో వెకువజామున పని చేసేవారికి చలి కోట్లు, వర్షాకాలంలో వాన నుంచి రక్షణకు రెయిన్ కోట్లు, వేసవి కాలంలో టోపీలు ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా చేతులకు గ్లౌజ్‌లు, మాస్క్‌లు, బూట్లు, ఏడాదికి ఒకసారి విధిగా అందించాలి. వీటితోపాటు సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు, శానిటైజర్ అందించాలి. రోడ్లు ఉడ్చేందుకు మహిళా కార్మికులకు చీపుర్లు ఇవ్వాలి. గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించేందుకు కొడవళ్లు ఇవ్వాలి. చెత్త, మురుగు కాలువల్లో వ్యర్థాలు ఎత్తేందుకు డబ్బాలు, పారలు ఇవ్వాలి. పురుష కార్మికులకు గడ్డపారలు, పారలు, గొడ్డళ్లు తదితర పరికరాలు ఇవ్వాలి. కానీ పారిశుద్ధ్య కార్మికులకు ఇవేమీ పూర్తి స్థాయిలో అందడం లేదు. చీపుర్లు కూడా మహిళా కార్మికులే తమ సొంత డబ్బులతో కొనుగోలు చేసుకుంటున్నారు.

కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లా



పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ దుస్తులు అందించే విషయంపై కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాను. చలికాలంలో కోటు, వేసవిలో టోపీలతో పాటు గ్లౌజ్‌లు, మాస్క్‌లు తదితర రక్షణ విషయాన్ని మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లా. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తాం. డ్రెస్సులు, నూనె, సబ్బులు అన్నింటిపై కౌన్సిల్‌లో చర్చిస్తాం.

– పూర్ణచందర్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

సృజనాత్మకతను వెలికితీసేందుకే ముగ్గుల పోటీలు



మిర్యాలగూడ ఆదిత్య పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

మిర్యాలగూడ టౌన్: మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ముగ్గుల పోటీలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సతీమణి బత్తుల మాధవి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని బుధవారం మిర్యాలగూడ హౌజింగ్‌బోర్డులో సంతోషిమాత ఆయిల్, ప్రియా గోల్డ్ ఆయిల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సూదిని వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రంగయ్య, కాసుల సత్యం, వేణుగోపాల్, డిస్ట్రిబ్యూటర్లు లకుమారపు పాండురంగయ్య, నరసయ్య తదితరులున్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాధవి

ఆదిత్య పాఠశాలలో ముగ్గుల పోటీలు

మిర్యాలగూడ: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఆదిత్య పాఠశాలలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తను కాపాడుకుంటా



మాట్లాడుతున్న బాలునాయక్

- ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ మండలంలోని కమలాపూర్ గ్రామంలో ఉమ్మడి ముదిగొండ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలునాయక్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ జానియాదవ్, జాల నర్సింహారెడ్డి, వేణుధర్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, సంజీవరెడ్డి, శిరందాసు కృష్ణయ్య, లోకసాని శ్రీధర్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, లోకసాని కృష్ణ, వెంకటేశ్వర్‌రావు, వెంకటయ్యగౌడ్, దేవేందర్, కొర్ర రాంసింగ్, యూనూస్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



అన్నెపాక గణేశ్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

దేవరకొండ: కొత్తగూడెంలో ఫిబ్రవరి 9న నిర్వహించనున్న జూనియర్ మిస్టర్ తెలంగాణ అండర్– 19 బాడీ బిల్డింగ్ పోటీల్లో దేవరకొండ పట్టణానికి చెందిన అన్నెపాక గణేశ్ పాల్గొననున్నాడు. ఈమేరకు అతడికి పీఆర్టీయూ టీఎస్ దేవరకొండ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ బుధవారం స్థానికంగా రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట వంశీకృష్ణ, విజయ్‌కుమార్, అశోక్, మాతంగి సురేష్, భాషా, హేమంత్ తదితరులున్నారు.

దివ్యాంగులను అక్కున చేర్చుకోవాలి

- డీఎస్పీ వెంకటగిరి

మిర్యాలగూడ అర్బన్: దివ్యాంగులను ఆదరించి అక్కున చేర్చుకోవాలని డీఎస్పీ వెంకటగిరి అన్నారు. డిఫరెంట్లీ ఏబుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగుల చట్టం 2016 వాల్‌పోస్టర్‌ను బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. దివ్యాంగుల హక్కుల రక్షణకు చట్టాలు ఉన్నాయని, బహిరంగ ప్రదేశాల్లో దివ్యాంగులను కించపరిచే వారిపై 2016 చట్టం సెక్షన్ 92 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల సురేందర్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బంటు నాగేందర్, సయ్యద్ హుస్సేన్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వెంకటగిరి, దివ్యాంగ అసోసియేషన్ సభ్యులు

గిరిజనుల అభ్యున్నతికే 'గిరి వికాసం'

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

గుర్రంపోడు: ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి గిరి వికాస పథకాన్ని అమలు చేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం గుర్రంపోడు మండలంలోని తేనపల్లి, తేనపల్లి తండాలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరి వికాస కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు తమకున్న భూముల్లో మెట్ట వ్యవసాయమే కాకుండా ప్రభుత్వం బోర్లు వేయించి భూములను సాగులోకి తెస్తుందన్నారు. ఎన్నికల హామీ మేరకు కాల్వపల్లికి బీటీ రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీపాద సుధాకర్, మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, జవహర్‌లాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

రేపటి నుంచి కబడ్డీ పోటీలు

మాడుగులపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మాడుగులపల్లి మండల కేంద్రంలో 12వ తేదీ నుంచి 14 వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రామీణస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడల నిర్వాహకులు కందుల వెంకన్న, జాకంటి వీరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల జట్లు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు తొలి బహుమతిగా రూ.25,116, రెండో బహుమతి 20,116, మూడో బహుమతి 17,116, నాలుగో బహుమతి 15,116, ఐదో బహుమతి 13,116, ఆరో బహుమతి 10,116, ఏడో బహుమతి 8,116, ఎనిమిదో బహుమతి 6,116తోపాటు షీల్డ్‌లు బహూకరించనున్నట్లు వెల్లడించారు. బెస్ట్ రైడర్, డిఫెండర్, ఆల్‌రౌండర్లకు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 89196 77756, 99484 28950లను సంప్రదించాలని కోరారు.

అయోధ్య రాముడి అక్షింతలకు ప్రత్యేక పూజలు



కొండమల్లేపల్లి: అక్షింతలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు



అయోధ్య అక్షింతల ఊరేగింపులో గ్రామస్తులు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలం చెన్నారం గ్రామంలోని దేవాలయంలో బుధవారం అయోధ్య రాముడి అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి మండలం కుర్రంపల్లి గ్రామంలో బుధవారం అయోధ్య రామాలయ అక్షింతల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డు శ్రీనివాస్ మాట్లాడుతూ 22వ తేదీన రామమందిర నిర్మాణం సందర్భంగా ఇళ్లల్లో దీపాలు వెలిగించాలని కోరారు.

మాడుగులపల్లి: మండలంలోని గండ్రవానిగూడెం గ్రామంలో బుధవారం హిందూ వాహిని కార్యకర్తలు, రామభక్తులు ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, సిరిగిరి శ్రీనివాస్‌రెడ్డి, నంద్యాల మోహన్‌రెడ్డి, రేఖ శంకర్, రాకేష్, మహేందర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మాడుగులపల్లి: అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

కేజీబీవీలో స్వపరిపాలన దినోత్సవం



తిరుమలగిరి కేజీబీవీలో ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల విద్యాలయంలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ఉన్నతాధికారులుగా, ప్రజా ప్రతినిధులుగా వ్యవహరించారు. అనంతరం శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు నృత్యాలు చేసి పలువురిని ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ కవిత, ఉపాధ్యాయులు కృష్ణవేణి, పుష్పలత, వీణ, సుల్తానా, విమల, హిమబిందు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో అందోజు కోటాచారి ఏర్పాటు చేసిన టింబర్ డిపో కార్పెంటర్ దుకాణానికి లైసెన్స్ లేదని, దీని ద్వారా వచ్చే శబ్దాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు గ్రామపంచాయతీలో ఫిర్యాదు చేశారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి వీరబాబు పోలీసుల సాయంతో మంగళవారం టింబర్ దుకాణాన్ని మూసి వేయించారు. దీంతో బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సంక్రాంతి పండుగ వరకు అవకాశం ఇవ్వాలని, అనంతరం లైసెన్స్ పొందుతామని వారు ఎంపీడీఓ బాలరాజురెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కర్ణకంటి జంగాచారి, అందోజు కోటాచారి, సానగంటి గోవర్ధన్, చెన్నయ్య, నరసింహాచారి, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

చందంపేట: చెంచులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములునాయక్, తహసీల్దార్ రాములు కోరారు. బుధవారం చందంపేట మండలంలోని కంబాలపల్లి, రేకులవలయం, పొగిళ్ల గ్రామాల్లోని చెంచు కుటుంబాలకు 'పీఎం జన్‌మన్' పథకాన్ని వివరించారు. అనంతరం చెంచు కుటుంబాలకు అందుతున్న వసతులు, మౌలిక సదుపాయాలు, తదితర అంశాలపై చర్చించారు.

విద్యారంగాన్ని పరిరక్షిద్దాం

నల్లగొండ: విద్యారంగాన్ని పరిరక్షించుకుందామని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (టీఎస్‌పీటీఏ) వార్షిక క్యాలెండర్ 2024ను బుధవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామపంచాయతీల పరిధిలో పాఠశాల లేని ప్రాంతాలను గుర్తించి పాఠశాలలను తెరిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉర్దూ పాఠశాలలు ఉన్న చోట ఉపాధ్యాయులను నియమించుకునేందుకు అనుమతినిస్తామన్నారు. కార్యక్రమంలో టీఎస్‌పీటీఏ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ గఫూర్, ప్రధాన కార్యదర్శి ఎండీ. షాహీన్ తయ్యబ్, కార్యదర్శి ఎ.రాములు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న భిక్షపతి, టీఎస్‌పీటీఏ ప్రతినిధులు

మాయమవుతున్న డివైడర్ గ్రిల్స్



కొండమల్లేపల్లి మండలంలోని జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారిలో డివైడర్‌పై కనిపించని గ్రిల్స్

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని జడ్చర్ల – కోదాడ రహదారిలో డివైడర్‌పై ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్ మాయమవుతున్నాయి. అవి శిథిలావస్థకు చేరుతుండడంతో గుర్తుతెలియని వ్యక్తులు వాటిని తొలగించి, తీసుకెళ్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రిల్స్ తొలగించకుండా తగిన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.





అమరవీరుల కుటుంబాలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

రామగిరి(నల్లగొండ): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలాన్ని జిల్లా కేంద్రంలోనే ఇవ్వాలని అమరవీరుల కుటుంబాలు బుధవారం జిల్లా కలెక్టర్ హరిచందనకు వినతి పత్రాన్ని అందజేశాయి. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆర్.నర్సింహ, జి.రఘురాం, జలందర్, ఏ.ఆనంద్, డి.నరేష్, శ్రీనివాసులు, ఎన్.వెంకట్‌రెడ్డి, బి.కోట్యానాయక్, కె.రాంబాబు, జి.మునీష్, జి.జ్యోత్స్న, బి.శ్రీలత తదితరులు ఉన్నారు.

నేడు బీజేపీ సమావేశం

నల్లగొండ టూటౌన్: బీజేపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం ఈనెల 11న ఉదయం 10:30 గంటలకు నల్లగొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజశేఖర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఈ సమావేశానికి నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ప్రమాదకరంగా బస్‌షెల్టర్

- పంట కాలువ పక్కనే చేపట్టిన నిర్మాణం
- మట్టి కొట్టుకుపోతుండడంతో కూలిపోయే ప్రమాదం

నిడమనూరు: మండలంలోని ముకుందాపురం ముదిమాణిక్యం మేజర్ కాలువ వద్ద తుమ్మడం వైపు వెళ్లే దారిలో బస్‌షెల్టర్ నిర్మించారు. పంట కాలువ ద్వారా నీరు పారుతుండడంతో మట్టి కొట్టుకుపోతుంది. దీంతో బస్‌షెల్టర్ ప్రమాదకరంగా మారింది. బస్‌షెల్టర్ కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై ఉండడంతో తుమ్మడం, నారమ్మగూడెం, రేగులగడ్డతో పాటు తిరుమలగిరి(సాగర్) మండలం, అడవిదేవులపల్లి మండలంలోని పలు గ్రామాలకు ఇక్కడి నుంచే ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ఆటోలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి, బస్‌షెల్టర్‌ను పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కాలువ వద్ద ప్రమాదకరంగా ఉన్న బస్‌షెల్టర్